సాక్షి అనంతపురం

సోమవారం । 29 । జూలై । 2024



ముగిసిన చెస్ పోటీలు

ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలు ముగిశాయి. 8లో



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.17, సరాసరి రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 10 నుంచి 18 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అక్రమాల డీలర్లపై చర్యలు తీసుకోండి

- అధికారులకు మంత్రి కేశవ్ ఆదేశం



పౌర సరఫరాల అధికారులతో సమావేశమైన మంత్రి కేశవ్

అనంతపురం అర్బన్: అక్రమాలకు పాల్పడిన చౌక ధరల దుకాణాల డీలర్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదివారం నగరంలోని తన నివాసంలో పౌర సరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అవినీతి, అక్రమాలకు పాల్పడిన చౌక దుకాణాలపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఏ దశలోనూ వారి చర్యలను ఉపేక్షించవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శోభారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి..

అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆ శాఖ అధికారులను మంత్రి కేశవ్ ఆదేశించారు. ఆర్టీసీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండులో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా వసతులు కల్పించాలని చెప్పారు. బస్సులు కండీషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్, డీఈ సురేంద్రబాబు, డిపో మేనేజర్ నాగభూపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిరుత మృతి



చిరుత కళేబరం

కూడేరు: మండల పరిధిలోని రామదుర్గం ఆంజనేయస్వామి ఆలయ సమీపాన అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందింది. చిరుత కళేబరాన్ని ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులు గుర్తించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని పరిశీలించారు. సుమారు పది రోజుల క్రితం మృతి చెందినట్లు తెలిపారు. వయసు పై బడటం, అనారోగ్య సమస్యలతో చిరుత మృతి చెంది ఉండొచ్చని చెప్పారు.

టీబీ డ్యాంకు 1,46,288 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం


బొమ్మనహాళ్: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర జలాశయానికి ఆదివారం భారీగా వరద పోటెత్తింది. 1,46,288 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో టీబీ బోర్డు అధికారులు డ్యాం 33 క్రస్ట్ గేట్లను ఎత్తి 1,56,871 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. తుంగభద్ర నదికి 1,47,516 క్యూసెక్కులు, కాలువలకు 9,118 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 97.791 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,630.98 అడుగులకు నీరు చేరింది.

నచ్చిన స్థానం కోసం..

నానా తంటాలు

రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ముగిసి కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. కొత్త ప్రభుత్వం ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు జిల్లా స్థాయిలో కొంత మంది అధికారులను బదిలీ చేసింది. ఇతర జిల్లాల వారిని రిలీవ్ చేసింది. ఈ క్రమంలో ఆయా పోస్టుల్లోకి వచ్చేందుకు కొందరు యత్నిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖల్లోని ఖాళీ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొంది. కీలక పోస్టులు దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు కోసం చక్కర్లు కొడుతుండగా, పలువురు ఇప్పటికే లేఖలు సంపాదించేశారు.

- ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారుల ప్రదక్షిణ
- సిఫారసు లేఖల కోసం తాపత్రయం
- బాధాకరమంటున్న కిందిస్థాయి సిబ్బంది





కలెక్టరేట్

అనంతపురం అర్బన్/సిటీ/ఎడ్యుకేషన్: జిల్లా యంత్రాంగానికి వెన్నెముకలా వ్యవహరించే రెవెన్యూ శాఖ పూర్తిగా అధికారపార్టీ కనుసన్నల్లోకి వెళ్తున్న వాతావరణం నెలకొంది. మండలాల కేటాయింపునకు ఆప్షన్లు ఇచ్చుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఇప్పటికే తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు తాము కోరుకున్న చోట పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఫలానా మండలానికి పంపిస్తే మీరు చెప్పినట్లే నడుచుకుంటామంటూ సాగిలపడుతున్నట్లు సమాచారం.

పోక్సో కేసు నిందితుడికి సిఫారసు లేఖ..

విద్యాశాఖకు సంబంధించి డీఈఓ కార్యాలయంలో ఏపీఓ, ఏఎస్ఓ పోస్టులకు చాలా మంది పోటీ పడుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పని చేసిన మంజునాథ్‌నాయుడు, శ్రీనివాసులు మళ్లీ ఇక్కడికి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరికి ఎమ్మెల్యే పరిటాల సునీత, మరొకరికి కాలవ శ్రీనివాసులు సిఫారసు లేఖలు ఇచ్చారు. ఈ లేఖలను డీఈఓ ద్వారా కలెక్టర్‌కు పంపినట్లు తెలిసింది. ఇక.. సమగ్ర శిక్ష కార్యాలయంలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులపై కొందరు టీచర్లు కన్నేశారు. ప్రస్తుతం జీసీడీఓగా పని చేస్తున్న మహేశ్వరి, అసిస్టెంట్ ఏఎంఓలుగా పని చేస్తున్న మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి రీప్యాట్రియేషన్ (రిలీవ్ చేయాలంటూ అభ్యర్థించడం) కోరారు. ఈ పోస్టులకు వచ్చేందుకు గతంలో అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్‌గా పని చేసిన టీచరు రామగిరి కిష్టప్ప మంత్రి సవిత సిఫార్సు లేఖతో అర్జీ ఇచ్చారు. పీడీగా పని చేస్తున్న చల్లా ఓబులేసు ఓ ఎమ్మెల్యే లేఖతో అర్జీ ఇచ్చారు. అలాగే మరో టీచరు సుబ్రమణ్యం, ఆయన సతీమణి కూడా అర్జీలు ఇచ్చారు. ఇదిలాఉంటే, సిఫారసు లేఖ పొందిన వారిలో ఒకరు పోక్సో కేసులో నిందితుడని తెలిసింది. గతంలో తాను పనిచేస్తున్న స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఘటనపై కేసు నమోదై రిమాండ్‌కు కూడా వెళ్లొచ్చాడు. అలాంటి వ్యక్తికి ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వడాన్ని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తప్పు పడుతున్నారు. అయితే, వీరికి విద్యాశాఖలో ఓ అధికారి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తన సామాజికవర్గం కావడంతో.. అన్నీ తాను చూసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పంచాయతీరాజ్‌లో తీవ్ర పోటీ..

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖల్లో కీలక పోస్టులు దక్కించుకునేందుకు పలువురు పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న జెడ్పీ సీఈఓ పోస్టులోకి వచ్చేందుకు అనంతపురం డీఎల్‌డీఓగా పని చేస్తున్న చిలంకూరు ఓబుళమ్మ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. డ్వామా పీడీగా వచ్చేందుకు బోయ సామాజికవర్గానికి చెందిన రామాంజనేయులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలో సీఈఓగా పని చేసి సెలవులో వెళ్లిన జల్లా శ్రీనివాసులు మరికొన్ని రోజుల్లో విధుల్లో చేరనున్నారు. ఈ క్రమంలో ఆయనే మళ్లీ జెడ్పీ సీఈఓగా వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని జెడ్పీ వర్గాలు అంటున్నాయి. ఇక.. జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) పోస్టుకూ పోటీ తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం డీపీఓగా పని చేస్తున్న ప్రభాకర్‌రావు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో.. ఆ పోస్టుకు కదిరి డీఎల్‌డీఓ సూర్యనారాయణ, అనంతపురం డ్వామాలో పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డి పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

ఊడిగంతో అభాసుపాలు

బదిలీల కోసం అధికారులు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల కోసం వెంపర్లాడడం, వారి ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఈ తీరే వారి అస్తిత్వాన్ని కోల్పోయేలా చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు అధికారులను పావులుగా వాడుకుంటూ వారితో చట్టవిరుద్ధమైన పనులను చేయించుకుంటున్నారు. సిఫారసులతో పోస్టింగ్ పొందిన అధికారులు ఒక రకంగా వారికి ఊడిగం చేయాల్సి వస్తోంది. ప్రధానంగా రెవెన్యూలో ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకులు చెప్పినట్లుగా నడుచుకోవాల్సి వస్తోంది. 2014 నుంచి 2019 మధ్యకాలంలో కూడేరు, శింగనమల మండలాల్లోని పలు గ్రామాల్లో నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన కొందరు తహసీల్దార్లు కొండగుట్టలను, ప్రభుత్వ భూములను, వాగులు వంకలకు సైతం అధికారపార్టీ నాయకుల అనుచరులకు పట్టాలు ఇచ్చేశారు. అలాంటి అధికారులు కొన్ని సందర్భాల్లో మూల్యం చెల్లించుకుంటున్నారు. 2014–19 సమయంలో అనంతపురం తహసీల్దారుగా పనిచేసిన అన్వర్ హుసేన్ ఉదంతమే ఇందుకు నిదర్శనం. అప్పట్లో ఓ ప్రజాప్రతినిధి చెప్పిన మాటలన్నీ విన్న అన్వర్ హుసేన్.. అటు తరువాత మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఏది ఏమైనా అధికారులు సిఫారసు లేఖల కోసం ప్రజాప్రతినిధుల గడపలు తొక్కినంత కాలం తమ అధికారాన్ని వారి వద్ద తాకట్టు పెట్టి ఊడిగం చేయక తప్పదని, ఇలాంటి వాటికి అధికారులు ఎంత దూరం ఉంటే వారి హోదాకు అంత గౌరవం లభిస్తుందని ఆయా శాఖల వర్గాలు బహిరంగంగానే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

సాయి సన్నిధిలో హిమాచల్ సాంస్కృతిక వైభవం



జానపద నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న హిమాచల్ ప్రదేశ్ బాలవికాస్ చిన్నారులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి సన్నిధిలో హిమాచల్ ప్రదేశ్ భక్తులు తమ సాంస్కృతిక వైభవాన్ని చాటారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి భక్తులు ఆదివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో మహాసమాధి చెంత వారి సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. సాయంత్రం 'హృదయార్పణ' పేరుతో హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి యూత్ సంగీత విభావరీ నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



ఉమామహేశ్వరరెడ్డి (ఫైల్)

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉమామహేశ్వరరెడ్డి (34) దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సంకేపల్లికి చెందిన నారాయణరెడ్డి, విజయలక్ష్మి దంపతుల కుమారుడు ఉమామహేశ్వర్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం కింద ఇంటి వద్ద నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి పనిమీద స్కూటీపై ముదిగుబ్బకు బయల్దేరాడు. కేజీబీవీ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో అనంతపురం ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే ఉమమామహేశ్వరరెడ్డి మృతి చెందాడు.

పెద్దాస్పత్రి గాడిలో పడేనా..?

- సమయపాలన పాటించని వైద్యులు
- సూపర్ స్పెషాలిటీ నిర్వహణలో లోపాలు
- నేడు జీజీహెచ్‌కు మంత్రి సత్యకుమార్



అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి పాలన గాడి తప్పింది. వైద్యులు సమయపాలన పాటించకపోవడం పెద్ద సమస్యగా మారింది. జీజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో మంత్రి సత్యకుమార్ సర్వజనాస్పత్రిని సోమవారం పరిశీలించనున్నారు. వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి స్పందించి ఆస్పత్రి పాలనను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎంసీహెచ్ బ్లాక్ అనివార్యం..

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు సర్వజనాస్పత్రి పెద్దదిక్కు. రోజూ 2,500 మంది ఓపీ, అడ్మిషన్‌లో 1,100 మంది ఉంటారు. అందులో గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో సేవలు పొందుతుంటారు. రోజూ 20 నుంచి 30 ప్రసవాలు జరుగుతుంటాయి. గైనిక్ విభాగంలోని నాలుగు యూనిట్లలో 120 పడకలు మంజూరైనా.. ప్రస్తుతం 220 మందికి సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో స్థలం చాలక ఆస్పత్రి ఆవరణంలో అసౌకర్యాల మధ్య షెడ్డులో ఉంచుతున్నారు. దీంతో మదర్ హెల్త్ చైల్డ్ బ్లాక్ (ఎంసీహెచ్ బ్లాక్) ఏర్పాటు అనివార్యమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రికి నాడు–నేడు పథకం కింద రూ.300 కోట్లతో సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్, వైద్యుల హాస్టల్ మంజూరైంది. ఎంసీహెచ్ బ్లాక్ పూర్తి కాగా, మిగిలిన భవనాల నిర్మాణం జరుగుతోంది. వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఖాళీ చేయాల్సి ఉంది. మంత్రి స్పందించి ఆ ప్రాంతంలో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేస్తే బాలింతలకు మరింత మెరుగైన వైద్యం అందుతుంది.

ఎమర్జెన్సీని విస్తరించాల్సిందే..

సర్వజనాస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగాన్ని విస్తరించాల్సి ఉంది. ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఉంటున్నారు. ఆ తరువాత సీఎంఓలదే బాధ్యత. వైద్యులు బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తూ పీజీలపై భారం వేసి పత్తా లేకుండా పోతున్నారు. దీనికి తోడు ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. తరచూ వైద్యులు, సిబ్బంది, రోగుల సహాయకుల వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఈఎన్‌టీ వార్డు పక్కన ఉన్న స్థలంలో డిజిటల్ బ్లాక్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జీజీహెచ్‌లో భాగమైన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా మారింది. ఆస్పత్రిలో మధ్యాహ్నం నుంచి వైద్యులు కనిపించడం లేదు. ఈ విషయాలన్నింటిపై మంత్రి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పసికందు కిడ్నాప్..

మూడు గంటల్లోనే కేసు ఛేదింపు

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ ప్రశంస



పసికందును తీసుకొస్తున్న డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్

అనంతపురం: ఆరు రోజుల పసికందును అపహరించిన ఘటనను పోలీసులు మూడు గంటల్లోనే ఛేదించారు. పసిబిడ్డను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత ఈ నెల 16వ తేదీన అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో కాన్పు నిమిత్తం చేరింది. ఈ నెల 23న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి తల్లీబిడ్డ ఆసుపత్రి గైనిక్ విభాగంలో వైద్య సేవలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు పసికందు అదృశ్యమైనట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతగా పరిగణించారు. వెంటనే కేసు ఛేదించాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూటౌన్ సీఐ క్రాంతికుమార్, నాల్గవ పట్టణ సీఐ ఆర్.ప్రతాప్ రెడ్డి, అవుట్‌పోస్టు ఎస్‌ఐ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డును దిగ్బంధనం చేసి అనుమానితులపై విచారణ చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. కురుకుంటకు చెందిన ఆమని అనే మహిళ పసికందును అపహరించినట్లు గుర్తించారు. ఆమె నుంచి పసికందును తీసుకుని తల్లిదండ్రులైన అమృత, అనిల్ కుమార్‌లకు డీఎస్పీ నేతృత్వంలో అప్పగించారు.

సాయం చేయడానికి వచ్చి..

నిందితురాలు ఆమని గైనిక్ వార్డులోకి మూడు రోజుల క్రితం వచ్చింది. అమృత బెడ్డు పక్కనే ఉన్న మరో రోగికి సపర్యలు చేసేది. ఆమెతో బంధుత్వం లేకపోయినప్పటికీ, ప్రతి రోజూ భోజనం తెచ్చి పెట్టి వెళ్లేది. ఈ క్రమంలో అమృత కుమార్తెపై మమకారం పుట్టింది. ఆమనికి ఇద్దరూ కొడుకులే కావడంతో కుమార్తె ఉండాలని భావించి పసికందును అపహరించింది.

జిల్లా ఎస్పీ ప్రశంస:

పసికందు అదృశ్యం ఘటనను మూడు గంటల్లోనే ఛేదించి తల్లిదండ్రుల వేదనను తీర్చిన అనంతపురం డీఎస్పీ టీవీవీ ప్రతాప్, టూటౌన్ సీఐ క్రాంతి కుమార్, నాల్గవ పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

సీసీ కెమెరాల్లో కదలికలను పసిగట్టి..

గైనిక్ వార్డుల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. వార్డులోకి వచ్చిన వారు, వెళ్లిన వారి కదలికలను ఆరా తీశారు. నిందితురాలు ఆమని పదేపదే తిరుగుతూ కనిపించింది. దీంతో హాస్పిటల్లోనే ఉన్న ఆమనిని పోలీసులు ప్రశ్నించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమెకు తెలియకుండా ఒక కానిస్టేబుల్‌ను ఇంటికి పంపించారు. ఇంట్లో పసికందు ఉండడంతో తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు ప్లాస్టిక్ బుట్టలో పాపను పెట్టుకుని అపహరించింది. ఆమనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

ఇసుకాసురులకు అడ్డేదీ..?



బ్రహ్మసముద్రం సమీపంలోని వేదావతి హగరి నదిలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: ఇసుకాసురుల చెరలో వేదావతి హగరి నది చిక్కుకుపోయింది. ఇష్టారాజ్యంగా చేపడుతున్న తవ్వకాలతో నది రూపురేఖలు మారిపోతున్నాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, రాయదుర్గం, బెళుగుప్ప తదితర మండలాల గుండా వేదావతి హగరి నది ప్రవహిస్తుంది. నది పరివాహక ప్రాంతాల్లో నాణ్యమైన ఇసుక లభిస్తోంది. ఇక్కడ దొరికే ఇసుకకు కర్ణాటకలో భారీగా డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలో నదిపై టీడీపీ నాయకుల కన్ను పడింది. ప్రభుత్వ ప్రకటించిన ఉచిత ఇసుక విధానాన్ని అనుకూలంగా చేసుకుని అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లలో నింపి సమీపంలోని బళ్లారి, చెళ్లకెర, మొలకల్మూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ. 5 వేల నుంచి రూ. 6 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఇసుకాసురులు తవ్విన ఇసుకను ఒక చోట డంప్ చేసుకుని రాత్రిళ్లలో సరిహద్దులు దాటిస్తున్నారు. అధికార పార్టీ నేతలకు భయపడిన రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో తమ ఆగడాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. విచ్చలవిడిగా వేదావతి హగరి నదిలో ఇసుక తవ్వుతుండడంతో భూగర్భజలాలు అడుగంటి సమీపంలోని రైతుల బోర్లలో నీరు అర్ధంతరంగా ఆగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీఏబీఆర్, జీబీసీకి నీటి మళ్లింపు

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామం వద్ద ఉన్న లింక్ ఛానల్ నుంచి పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)కు 400 క్యూసెక్కుల నీటిని హెచ్చెల్సీ డీఈ మద్దిలేటి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నీటిని మొదటి ప్రాధాన్యతగా పీఏబీఆర్‌కు మళ్లించామని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి అవసరాల దృష్ట్యా డ్యాంను పూర్తిగా నింపడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని రోజుల తరువాత మిడ్ పెన్నార్ డ్యాం (ఎంపీఆర్)కు నీటిని విడుదల చేస్తామన్నారు.

- ఉరవకొండ మండల పరిధిలోని నింబగల్లు హెడ్ రెగ్యులేటరీ వద్ద ఉన్న గుంతకల్లు బ్రాంచ్ కాలువ (జీబీసీ)కు కూడా తుంగభద్ర జలాలను ఆదివారం అధికారులు విడుదల చేశారు. 120 క్యూసెక్కుల మేర నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే మళ్లించారు. ఈ సందర్భంగా జీబీసీ అధికారులు మాట్లాడుతూ జీబీసీ ఆయకట్టుకు సంబంధించి సాగు నీటి సలహా మండలి (ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశంలో చర్చించిన అనంతరం నీరు విడుదల చేస్తామన్నారు. ఎక్కడా జల చౌర్యం జరగకుండా కాలువ వెంబడి గస్తీ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.



మోపిడి లింక్ ఛానల్ నుంచి పీఏబీఆర్‌కు వెళ్తున్న జలాలు



జీబీసీలో తుంగభద్ర జలాలు

నిరుద్యోగులకు వరం



అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం


శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగులకు బీసీ స్టడీ సర్కిల్ వరంగా మారింది. ప్రతి నెలా స్టైఫండ్ ఇవ్వడంతో పాటు స్టడీ మెటీరియల్ కూడా ఇస్తుండటంతో వారికి ఎంతో ఊరట కలుగుతోంది. వేల రూపాయలు ప్రైవేటు కోచింగ్‌లకు చెల్లించే పనిలేకుండా ఉచితంగా శిక్షణ దొరుకుతోందని అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ
- ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కో బ్యాచ్‌లో 200 మందికి అవకాశం
- గ్రూప్ 1, 2 తో పాటు పలు ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధం
- నెలకు రూ.1500 స్టైఫండ్‌తో పాటు స్టడీ మెటీరియల్

అనంతపురం రూరల్: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే వేలకు వేల రూపాయాలు వెచ్చించి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎస్‌ఐ, గ్రూప్ 1, 2, సచివాలయ, రైల్వే, బ్యాంకింగ్ ఉద్యోగాలతో పాటు వివిధ పోటీ పరీక్షలకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాల్లో ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయించారు. అయితే గత ఐదేళ్లలో బీసీ స్టడీ సర్కిళ్లలో మౌలిక వసతులు కల్పించి నిష్ణాతులైన ట్యూటర్లతో శిక్షణ ఇప్పించడంతో ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి.

శిక్షణతో పాటు స్టైఫండ్..

పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి ప్రతి బ్యాచ్‌కు అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నారు. వీరిలో 66 శాతం సీట్లు బీసీలకు, 20 శాతం సీట్లు ఎస్సీలకు, 14 శాతం సీట్లు ఎస్టీలకు కేటాయిస్తున్నారు. శిక్షణకు ఎంపికయ్యే అభ్యర్థులకు రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో ఉచితంగా మెటీరియల్, నెలకు రూ. 1500 చొప్పున రెండు నెలల పాటు స్టైఫండ్ అందిస్తుండటంతో శిక్షణ పొందటానికి దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అందించిన ప్రోత్సాహాన్ని కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అందిస్తుందా? లేదా అన్నది మాత్రం వేచి చూడాలి.

అన్ని వసతులు కల్పించారు



ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ సరైన ఉద్యోగాలు లభించక చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న నాలాంటి వారికి ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తం. రెండు నెలల నుంచి గ్రూప్–2 పరీక్షలకు శిక్షణ పొందుతున్నా. స్టడీ సర్కిల్ కార్యాలయంలో మాకు అన్ని వసతులు కల్పించారు. స్టడీ మెటీరియల్, స్టైఫండ్ అందిస్తుండటంతో పోటీ పరీక్షలకు అన్ని విధాలా సన్నద్ధమయ్యాను.

– చిరంజీవి, కళ్యాణదుర్గం

ప్రైవేటుగా ఫీజు చెల్లించలేం



ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో గ్రూప్–2 కోచింగ్ తీసుకోవాలంటే వేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి. వేలకు వేలు చెల్లించి కోచింగ్ తీసుకోవాలంటే పేద, మధ్యతరగతి నిరుద్యోగ యువతకు సాధ్యం కాదు. బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తుండడంతో పేద నిరుద్యోగ యవత ఉద్యోగాలు సాధించుకోగలుగుతున్నారు.

– అపర్ణ, అనంతపురం

అన్ని ఏర్పాట్లు చేశాం



పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. శిక్షణ పొందే వారికి మౌలిక వసతులు కల్పించడంతో పాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నాం. అలాగే రెండు నెలల పాటు నెలకు రూ.1500 చొప్పున స్టైఫండ్ కూడా ఇస్తున్నాం.

– కుష్బూకొఠారి,
ఉప సంచాలకులు, బీసీ స్టడీ సర్కిల్

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.4,11,700 స్వాధీనం
- 10 మంది అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ తోటలో పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ తెలిపిన వివరాల మేరకు.. గార్లదిన్నె సమీపంలో వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ వెంకటశివారెడ్డి ఆధ్వర్యంలో గార్లదిన్నె, శింగనమల పోలీసులు దాడులు చేశారు. ఇందులో భాగంగానే 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,11,700 నగదు, 20 ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో శింగనమల ఎస్‌ఐ చంద్రశేఖర్, గార్లదిన్నె ఏఎస్‌ఐ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

400 టీఎంసీల సాధనతోనే రాయలసీమ సస్యశ్యామలం


సదస్సులో మాట్లాడుతున్న దశరాథరామిరెడ్డి

అనంతపురం సెంట్రల్: రాయలసీమ జిల్లాలకు 400 టీఎంసీల నికరజలాలు సాధించడం ద్వారా సీమ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని రాయలసీమ సాగునీటి సంఘం అధ్యక్షుడు దశరథరామిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆదివారం మార్కెట్‌యార్డు సమీపంలో భారత్ ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమకు సాగు, తాగునీరు ఇవ్వడానికి సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు నిర్మాణంతో పాటు తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకి సమాంతర కాలువ నిర్మాణం జరగాలన్నారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్‌బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని, శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకు నీళ్లు, నిధులు, రాజధాని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమ అభివృద్ధిని గాలికొదిలేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఐటీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, రైతు సంఘం నాయకులు హనుమన్న, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంఘాల నాయకులతో చర్చలు జరపాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హృదయరాజు మాట్లాడుతూ జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఏపీజీఎల్ఐసీ, పీఎఫ్ విభాగాల్లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర మెమో 57 అమలు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఆలస్యం అవుతున్న నేపథ్యంలో వెంటనే పని సర్దుబాటు చేపట్టాలన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించడానికి రోడ్ మ్యాప్ తయారు చేయాలని కోరారు. వేతన సవరణ ఆలస్యం కారణంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని తెలియజేశారు. సమావేశంలో సంఘం పూర్వ ప్రధాన కార్యదర్శి కే కులశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస నాయక్, ఐఫియా సభ్యులు సత్యప్రసాద్, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు తిమ్మప్ప, జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు రవీంద్ర, ఆంజనేయులు నాయక్ , అశోక్‌నాయక్, సాయినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్


మాట్లాడుతున్న ఆర్‌యూపీపీ రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర సహాధ్యక్షుడు సి.ఎర్రిస్వామి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.హనుమేష్, జి.తులసిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలో ఆర్‌యూపీపీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎర్రిస్వామి, హనుమేష్, తులసిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రంగా మొట్టమొదటగా ఏర్పడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఇంతటి కీర్తి సంపాదించుకున్న తెలుగు రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమం బోధన లేకపోవడం విచాకరమన్నారు. కేవలం ఆంగ్ల మాధ్యమం అనేది కాకుండా సమాంతరంగా తెలుగు మాధ్యమం కూడా అమలు చేయాలన్నారు. తెలుగు బోధించే కొందరు టీచర్లు డీఈఓ పూల్‌లో ఉంటూ ఇబ్బంది పడుతున్నారన్నారు. వారికి వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌యూపీపీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవిందు, నాయకులు ధర్మపురి వెంకటేశ్, గోపాల్, నవీన్‌కుమార్, వెంకటరమణారెడ్డి, ధనుంజయ, రవికుమార్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించండి


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఆలస్యం, అలసత్వం లేకుండా 12వ పీఆర్సీకి సంబంధించిన మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ జిల్లా ముఖ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి అధ్యక్షతన నగరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీజీఎల్ఐసీ ఫైనల్ పేమెంట్లు, మెచ్యూర్ అయిన బాండ్ల పేమెంట్లు చెల్లించాలని కోరారు. మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆగిపోయిన ఇంగ్లిష్ పదోన్నతులు వెంటనే చేపట్టాలన్నారు. కేజీబీవీ టీచర్లకు ఎంటీఎస్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధపు రామాంజనేయులు మాట్లాడుతూ జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ శివయ్య చారి, సురేష్ బాబు, జిల్లా నాయకులు రాజశేఖర్, మహమ్మద్ రఫీ, నాగభూషణం, మల్లికార్జున, కృష్ణమూర్తి నాయుడు, రాజన్న పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

- విజేతలుగా ఈశ్వరప్రసాద్, కాశి సమిక

అనంతపురం: ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అండర్–7 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్ షిప్ పోటీలు ముగిశాయి. అండర్–07 ఓపెన్ విభాగంలో ఈశ్వర ప్రసాద్ 4/4 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. అండర్–07 బాలికల విభాగంలో కాశి సమిక 3/3 పాయింట్లతో విజేతగా నిలిచింది. విజేతలకు బహుమతులను టోర్నమెంట్ డైరెక్టర్ కిషోర్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున, నేషనల్ ఆర్బిటర్ కమల్ అందజేశారు. విజయనగరంలో ఆగష్టు 3,4 తేదీల్లో జరిగే ఏపీ రాష్ట్ర అండర్–07 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో వారు పాల్గొంటారని ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు తెలిపారు.

కరిడికొండ టూ కర్ణాటక


బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం


పారిశ్రామికవాడలోని ఓ ప్రాంతంలో డంప్ చేసిన చౌక బియ్యం

- జోరుగా రేషన్ బియ్యం దందా
- 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత
- రూ.10తో కొనుగోలు..రూ.30 ప్రకారం విక్రయం

గుంతకల్లు: లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన 20 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తుండగా ఆదివారం ఉదయం పట్టుకున్నట్లు రూరల్ సీఐ సురేష్ తెలిపారు. పట్టణ శివారులోని గుంతకల్లు–గుత్తి రోడ్డులోని అయ్యప్ప ఫైర్ వర్క్స్ సమీపంలో రేషన్ బియ్యాన్ని బొలెరోలో తరలిస్తున్నట్లు పక్కా సమాచారం రాగా దాడులు నిర్వహించామన్నారు. బొలెరో (ఏపీ02 టీబీ 6169) వాహనంలో దాదాపు 40 తెల్లని సంచుల్లో 20 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. సీఎస్‌డీటీ ఎస్.సుబ్బలక్ష్మీ, వీఆర్‌ఓ కృష్ణ సమక్షంలో వాహనంతో పాటు బియ్యాన్ని సీజ్ చేసి డ్రైవర్ పాగుల సురేష్‌తో పాటు కరిడికొండకు చెందిన రామచంద్రపై కేసు నమోదు చేశామన్నారు. గుంతకల్లు పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రజల వద్ద గల స్టోర్ బియ్యాన్ని కేజీ రూ.10 ప్రకారం కొనుగోలు చేసి కరిడికొండకు చెందిన రామచంద్రకు కిలో రూ.15 చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు.

కరిడికొండ టూ కర్ణాటక..

గుత్తి మండలంలోని కరిడికొండ కేంద్రంగా చౌక బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేట, తుమకూరుకు తరలిస్తున్నారు. రేషన్ మాఫియాకు చెందిన కొందరు మహిళలు ఇళ్ల వద్ద వెళ్లి ప్రజలకు మభ్యపెట్టి కేజీ రూ.10తో కొనుగోలు చేస్తున్నారు. ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని కరిడికొండకు చెందిన రామచంద్ర డంప్‌గా ఏర్పాటు చేసుకొన్న తరువాత ఒక్కసారిగా కొన్ని వందల క్వింటాళ్ల బియ్యాన్ని పెద్ద లారీల్లో కర్ణాటకలోని బంగారుపేట లేదా తుమకూరుకు తరలిస్తున్నాడు. అక్కడ ఉన్న మిల్లర్లకు చౌక బియ్యాన్ని కేజీ రూ.30కి పైగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మిల్లర్లు బియ్యాన్ని పాలిష్ చేసి కేజీ రూ.40కి పైగా అమ్ముతున్నారు. బియ్యానికి ఎక్కువగా డిమాండ్ ఉండే దుబాయ్, మస్కట్ తదితర దేశాలకు ఓడలలో తరలిస్తున్నట్లు సమాచారం.

కీలక అధికారి లేని సమగ్ర శిక్ష

- ఈ నెల 22న రిలీవ్ అయిన వైఖోం నిదియాదేవి
- ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు డీఈఓ ససేమిరా



సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా వ్యవస్థలో సమగ్ర శిక్ష అత్యంత కీలకమైన ప్రాజెక్ట్. ప్రతి విద్యాభివృద్ధి కార్యక్రమం ఈ ప్రాజెక్ట్ ద్వారానే అమలవుతోంది. ప్రభుత్వం ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయల పనులను పర్యవేక్షించే బాధ్యత ఈ శాఖదే. అలాంటి శాఖకు జిల్లాస్థాయిలో ఉండే ముఖ్యమైన అధికారి అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఏపీసీ) పోస్టు. ఇంతటి ప్రాధాన్యత కల్గిన పోస్టుకు జిల్లాలో దిక్కులేరు. గతంలో ఇన్‌చార్జ్‌గా ఉన్న వైఖోం నిదియాదేవి కడప జిల్లాకు బదిలీ కావడంతో ఈనెల 22న రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి ఏపీసీ పోస్టు ఖాళీగానే ఉంది. కీలక సమయంలో కనీసం ఎవరికీ బాధ్యతలు కూడా ఇవ్వలేదు. డీఈఓనే ఏపీసీ బాధ్యతలను తీసుకోవడం పరిపాటి. ప్రస్తుత డీఈఓ వరలక్ష్మి అదనపు బాధ్యతలు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. తనకు అనారోగ్యం, ఇతర ఇబ్బందులున్నాయంటూ ఉన్నతాధికారులకు విన్నవించారు. గతంలో ఏపీసీ వరప్రసాదరావు రిటైర్డ్ కావడంతో డీఈఓ వరలక్ష్మికే ఏపీసీ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పుడు కూడా ఆమె ఈ బాధ్యతలు తీసుకోకుండా కొర్రీ వేశారు. ఏడీ లేదా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్‌లో ఒకరికి ఇన్‌చార్జ్ ఇవ్వాలంటూ ఫైలు సిద్ధం చేసుకుని కలెక్టర్ వద్దకు వెళ్లగా ఆయన ఆ ఇద్దరినీ కాదని జెడ్పీ సీఈఓగా ఉన్న ఐఏఎస్ అధికారి నిదియాదేవికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుంటు పడుతున్న విద్యాభివృద్ధి

సమగ్ర శిక్ష ఏపీసీగా ఎవరూ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడి విద్యాభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నాయి. వివిధ ఫైళ్లు పెండింగ్ పడ్డాయి. నెల ముగుస్తుండడంతో ఉద్యోగుల జీతాల బిల్లులు పెట్టాల్సి ఉంది. దీనికితోడు విద్యా సీజన్ కావడంతో స్టూడెంట్ కిట్ల పంపిణీ, కేజీబీవీల్లో అడ్మిషన్లు, అకడమిక్ మానిటరింగ్, యూడైస్, నాడు–నేడు పనులను పర్యవేక్షించేవారు లేరు. సెక్టోరియల్ అధికారులు ఉన్నా వారిని సమన్వయం చేయాల్సిన అధికారి లేరు. సమస్యలపై సెక్టోరియల్ అధికారులతో పాటు సమగ్ర శిక్ష ఉద్యోగులను కలిస్తే ఏపీసీ లేరు కదా? వచ్చిన తర్వాత కలిసి మాట్లాడండంటూ సలహా ఇస్తున్నారని హెచ్ఎంలు చెబుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఏపీసీ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికైనా అప్పగించాలంటూ ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, కేజీబీవీల ఎస్ఓలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అవోపా అధ్యక్షుడిగా భవనాశి వెంకటేష్



ఏకగ్రీవంగా ఎంపికైన అవోపా కార్యవర్గం

అనంతపురం కల్చరల్: అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడిగా భవనాశి వెంకటేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక రాజు రోడ్డులోని అవోపా కార్యాలయంలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జయంతి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏపీ అవోపా ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, నాగేశ్వరరావు, శంకరనారాయణ, శ్రీరామ సుధాకర్ సదరు నూతన కార్యవర్గ ఎంపికను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ అనేక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను గతంలో అనేక నిర్వహించామని, మళ్లీ అదే పద్ధతిలో పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా భవనాశి వెంకటేష్‌ను పలు సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనార్దన్, పార్థం నాగభూషణం, చంద్రమోహనగుప్తా, కలవల సతీష్, మంజు, రామయ్య, ఉషారాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు నివేద్



అనంతపురం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అనంతపురానికి చెందిన నివేద్ ఎంపికయ్యాడు. ఇటీవల విజయనగరంలో జరిగిన తైక్వాండో పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు పాల్గొంది. ఇందులో నివేద్ 39 కేజీల కేటగిరిలో ప్రతిభ ప్రదర్శించి గోల్డ్‌మెడల్ దక్కించుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకూ జాతీయస్థాయి పోటీలు జరుగుతాయి. నివేద్‌తో పాటు అతని కోచ్ శ్రీకాంత్‌రెడ్డిని జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్. గురుస్వామి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కే. శాంతరాజ్ అభినందించారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల జట్ల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు సెలక్షన్ కమిటీ కన్వీనర్ ఈశ్వరయ్య తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన సెలక్షన్‌కు 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను అనంతపురం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శి కే. గౌస్‌మొయిద్దీన్, ఎస్. వెంకటేశులు ప్రకటించారు. ఎంపికైన సబ్ జూనియర్ క్రీడాకారులు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో సెప్టెంబర్‌లో జరిగే అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారు. జూనియర్ బాల, బాలికల టోర్నీ విశాఖపట్నంలో జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటారు.

సబ్‌జూనియర్ బాలుర జట్టు

పి. జిలాన్, జి. అల్తాఫ్, ఆర్. రాజశేఖర్, టి. హర్షవర్ధన్, ఎస్. వీరేంద్ర, శివ చరణ్ , జి. బ్రహ్మరాజు, ఎస్. మనోజ్, యు. చిరంజీవి, సమర్.

సబ్‌జూనియర్ బాలికల జట్టు..

వి. లక్ష్మి, విశాల, విద్య , సౌమ్య, సుకన్య, చరిత, మానస, శాంతి, సుప్రజ, రుషిత.

జూనియర్ బాలుర జట్టు..

దురా సాయి, శ్రీనాథ్, మదన్‌మోహన్, జిలాన్, రాజశేఖర్, అల్తాఫ్, ఇబ్రహీం, నిఖిల్, సాయి రక్షిత్, శ్రీనివాసులు

జూనియర్ బాలికల జట్టు..

శిల్ప, లక్ష్మి, సుస్మిత, చందన, గాయత్రి, కృష్ణవేణి, స్వాతి, భవిజ్ఞ, లక్ష్మి, గౌతమి.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం (ఎస్కేయూ క్యాంపస్) ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి అన్నారు. ఆదివారం నూతన జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా శిక్షా సప్తాహ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ డే'లో విద్యార్థిని, విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. వీటి సంరక్షణ బాధ్యతను పాఠశాలలో పిల్లలే చూసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్' కు స్పందించి కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

కెప్టెన్ నారాయణప్ప సేవలు ప్రశంసనీయం



కెప్టెన్ డాక్టర్ నారాయణప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం: కెప్టెన్ డాక్టర్ నారాయణప్ప యుద్ధ సమయాల్లో విశిష్ట సేవలందించారు. సైన్యం నుంచి తిరిగి వచ్చిన తరువాత అనంతపురం పట్టణంలో తాత క్లినిక్‌ను ఏర్పాటు చేసి అనేక మంది ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందించారని జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప కొనియాడారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కెప్టెన్ డాక్టర్ నారాయణప్ప సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ అధ్యక్షుడు షేకన్న, గౌరవాధ్యక్షుడు వీకే రంగా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వర రావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, తలమర్ల కృష్ణ, రామ్‌గోపాల్, బీఏ హుస్సేన్, వై.ప్రసాద్, గొల్ల ఈశ్వరయ్య, నాగరాజు, ఖాజా మొయిద్దీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భర్తపై దాడి



గాయపడిన రమేష్

అనంతపురం: నగరంలో మరువకొమ్మ కాలనీలో ఆదివారం భర్తపై కొంతమందితో కలిసి భార్య దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. రమేష్‌పై భార్య సావిత్రమ్మ మరి కొంత మంది దాడి చేశారు. రమేష్‌ను కాదని రెండున్నర నెలల కిందట సావిత్రమ్మ వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో రమేష్‌పై గృహ హింస కేసు నమోదు చేసింది. ఆదివారం కట్టెలు, రాడ్లతో రమేష్‌పై దాడి చేయించింది. క్షతగాత్రుడిని సర్వజనాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ స్టోర్‌లో చోరీ

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో ఉన్న వినాయక మెడికల్ స్టోర్‌లో ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమీపంలో చోరీ జరిగింది. ఓవర్ బ్రిడ్జికి పక్కనే ఉన్న వినాయక్ మెడికల్ స్టోర్‌లో దుండుగలు ప్రవేశించి ఒక బంగారు చైన్, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. సీసీ టీవీ ఫుటేజీలను బట్టి ఇద్దరు దొంగలు తాళం చెవి పగులగొట్టి లోపలికి వెళ్లి నగదు తీసుకెళ్లినట్లు స్పష్టమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి కేశవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి, సీపీడబ్ల్యూఎస్ తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీఐటీయూ నాయకులు విన్నవించారు. ఆదివారం నగరంలో మంత్రిని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని తెలిపారు. బకాయి వేతనం, పీఎఫ్ చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన బీబీ ఫాతిమా పీర్లు

అనంతపురం కల్చరల్: బీబీ ఫాతిమా జాతర ఆదివారం ముగిసింది. ఐదవ రోడ్డు జనజాతరను తలపిస్తూ సందడిగా మారింది. వందల మంది యువకులు తరలి వచ్చిన భక్తులతో చక్కెర చదివింపులు చేయించారు. అమ్మవారి మకానం వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున చాలా మంది అమ్మవారి నామస్మరణ చేస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం సంప్రదాయ మేళతాళాలు, డప్పుల హోరులో పీర్ల స్వాములను జలధికి తీసుకెళ్లారు. నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, మహేష్ మాట్లాడుతూ.. ఏటా బీబీ ఫాతిమా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం అమ్మవారి చివరి దర్శనం ఉంటుందన్నారు. అలాగే దూద్‌వలి, బాబా ఫకృద్దీన్, పెనుగొండ బాబయ్య పీర్ల మకానం వద్ద ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి.

రమణ కొట్టాలులో..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుకుంట పంచాయతీ పరిధిలోని రమణ కొట్టాలులో చిన్న పీర్ల పండగ సందర్భంగా ఆదివారం పీర్ల జలధి ఉత్సవం జరిగింది. పీర్లను వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం జలధికి వెళ్లాయి. ఏపీ ఎమ్మార్పీఎస్ రమణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఓబులేసు, మల్లికార్జున, కుంటెన్న, సోము, నాగరాజు, హరి, చిట్టి, కొల్లప్ప, ఈరన్న, రషీద్, నరసింహులు పాల్గొన్నారు.



బీబీ ఫాతిమా పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



పీర్లకు మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

రాప్తాడు: మొహర్రం వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో రాప్తాడులో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. గ్రామంలో రైతులు చెట్లను తీసుకువచ్చి పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలోకి వేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి 11 గంటలకు గ్రామస్తులు అగ్నిగుండానికి నిప్పు అంటించారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పీర్లను ఊరేగించారు. భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆరు గంటలకు గుండాన్ని పూడ్చి పీర్లను జలధికి తరలించారు. మండలంలోని హంపాపురం, గాండ్లపర్తి, జి.కొత్తపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో మొహర్రం జలధి ఉత్సవాలు జరిగాయి. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రాప్తాడు సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



దప్పుచప్పుళ్ల మధ్య పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



రాప్తాడులో భక్తుల సందడి



రమణ కొట్టాలులో పీర్ల ఊరేగింపు



పీరును ఎత్తుకొస్తున్న యువకుడు

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన

అనంతపురం అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖ రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రం ప్రవేశపెట్టి బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయానికి అన్యాయం జరిగిందని మండిపడ్డారు. ఆదివారం స్థానిక టవర్ క్లాక్ వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కాకులను కొట్టి గద్దలకు పెట్టినట్లుగా ఉందన్నారు. ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి పథకానికి నిధులు కొతపెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇవ్వడమేనా వికసిత్ భారత్ అంటూ ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లుగా ఇది వికసిత్ భారత్ కాదని అన్నదాతల ఆత్మహత్యలు, అప్పుల భారత దేశమని ఎద్దేవా చేశారు. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడం రైతులను చిన్న చూపు చూడడమే అని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని తెలిపారు. నల్లప్ప, చెన్నారెడ్డి, రాముడు, బి.చంద్రశేఖర్‌రెడ్డి, రాము, రమీజా, మల్లికార్జున, గంగాధర్, నాగమ్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నిరంతర వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలు

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్య (సీఎంఈ)తో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో సామాజిక వైద్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ సీఎంఈ ద్వారా వ్యాధుల నిర్మూలనకు ఉపయోగపడే అంశాలను తెలుసుకోవచ్చన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. జోనల్ సీఎంఈను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుధాకుమారి, జోనల్ డబ్ల్యూహెచ్ఓ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ భవాని, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్ ప్రసంగించారు. సామాజిక వైద్య శాస్త్ర విభాగ అధినేత డాక్టర్ టీ మధు మాట్లాడుతూ.. 8 వైద్య కళాశాలల నుంచి 150 మంది పోస్టు గ్రాడ్యుయేట్స్ హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పులివెందుల వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ నవీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజియాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ సరళ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

గవర్నర్‌ను అవమానిస్తే ఎలా?

అనంతపురం కార్పొరేషన్: జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శన్ రావు జేఎన్‌టీయూ పరిపాలన భవనం లెక్చరల్ హాల్ వద్ద ఇటీవల గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించిన శిలాఫలకాన్ని తొలగించి, గతంలో సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన శిలాఫలకాన్ని పునరుద్ధరించడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇది రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవిని అవమానించడమే అన్నారు. తక్షణం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆవిష్కరించిన శిలాఫలకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

స్టాఫ్‌నర్సులు, ఎఫ్ఎన్ఓ సస్పెన్షన్‌కు సిఫార్సు

అనంతపురం మెడికల్: అనంతపురం సర్వజనాస్పత్రిలో ఆదివారం గైనిక్ వార్డులో పసికందు మిస్సింగ్ కేసులో సెక్యూరిటీ సునీతను విధుల నుంచి తొలగించినట్లు (టర్మినేట్) సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. స్టాఫ నర్సులు సువర్ణమ్మ, శ్రవణమ్మ, ఎఫ్ఎన్ఓ సుజాతలను సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాప్తాడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనుంది. నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని నగరపాలక సంస్థ అధికారులు తెలిపారు.

102 మందికి వైద్య సేవలు

రాప్తాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం 102 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ఆకట్టుకున్న శివపదం నృత్యరూపకం



శివపదం నృత్యరూపకంలో కళాకారుల అభినయం

అనంతపురం కల్చరల్: శ్రీనృత్యకళానిలయం చిన్నారులు ప్రదర్శించిన శివపదం నృత్యరూపకం ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం సందర్భంగా సాగుతున్న ప్రవచనంలో భాగంగా ఆదివారం సాగిన నృత్యరూపకాలు అందరిలో భక్తి భావాన్ని నింపాయి. స్థానిక మూడవ రోడ్డులోని జీఆర్ ఫంక్షన్‌హాలు వేదికగా నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యులు శ్రద్ధ, హర్షిణి పార్వతీ పరమేశ్వరులుగా అభినయించారు. ఇతర చిన్నారులు కూచిపూడి నాట్యం, భజన బృందాల భక్తిగీతాలతో శివుడికి నీరాజనాలర్పించారు. అనంతరం ప్రముఖ ప్రవచన కర్త సామవేదం షణ్ముఖశర్మ శివసాక్షాత్కారం అనే అంశంపై మాట్లాడారు. భోళాశంకరుడైన మహాశివుడు అనేక లీలా మహాత్మ్యాల ద్వారా జగతికి గొప్ప సందేశమందించారని తెలియజేశారు. ఈనెల 31న సాయిట్రస్టు, షణ్ముకశర్మ ఆధ్వర్యంలో గిరిజా కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విజయ్ సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి శ్రీనివాసులు, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ కృష్ణ శశి, ప్రవీణ్‌కుమార్, శ్రీధరమూర్తి, శ్రీనిధి రఘు, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డి జీవితం ఆదర్శప్రాయం

అనంతపురం కల్చరల్: ఈనాటి సంక్షోభాన్ని ఏనాడో ఊహించిన దార్శనికుడు తరిమెల నాగిరెడ్డి. ఆయన జీవితం ఎంతో మందిలో స్ఫూర్తినింపిందని విప్లవ కవి జెట్టీ జైరామ్ అన్నారు. ఆదివారం విప్లవతారలు టీఎన్ (తరిమెల నాగిరెడ్డి), దేవులపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతులను భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (ఎంఎల్) కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జెట్టీ జైరామ్ మాట్లాడుతూ.. తరిమెల నాగిరెడ్డి స్ఫూర్తిదాయక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా నిరుపేదల పట్ల టీఎన్‌కు ఉన్న నిబద్ధత మరెవరికి లేదన్నారు. తాకట్టులో భారతదేశం రచనలో పెట్టుబడిదారి వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపిన వైనం సరికొత్త పోరాటాలకు మూలమైందన్నారు. నిరంకుశ ప్రభుత్వాల దోపిడీ, ప్రపంచీకరణ విధానాల వల్ల సాగిన సంక్షోభం తదితర విషయాలపై భారత చైనా మిత్ర మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌రెడ్డి, నాగభూషణం, జి.భాస్కర్, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, డీఎస్‌వో రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తదితరులు మాట్లాడారు. కామ్రేడ్ డీవీ, టీఎన్ చూపించిన విప్లవమార్గంలో పయనించడమే ప్రజల సమస్యలకు పరిష్కారమన్నారు. కార్యక్రమంలో వివిధ విప్లవ సంస్థల ప్రతినిధులు, రచయితలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్లవ కవి జెట్టీ జైరామ్

నదుల అనుసంధానంతోనే నీటి సమస్య పరిష్కారం

అనంతపురం కల్చరల్: అనేక దశాబ్దాలుగా అనంతకు జరుగుతున్న అన్యాయాలు, నీటి సమస్యలపై హృద్యమైన కవిత్వాన్ని వెలువరిస్తున్న మల్లెల అభినందనీయుడని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మట్టి తంబూర' 'మాకూ ఒక నది కావాలి ' కవితా సంపుటాల ఆవిష్కరణ జరిగింది. సమావేశానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుప్రసిద్ధ విమర్శకుడు లక్ష్మీనరసయ్య, కవి, జర్నలిస్టు డాక్టర్ బండారు ప్రసాదమూర్తి, మరో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి తదితరులు హాజరయ్యారు. విమలశాంతి శాంతి సమితి వ్యవస్థాపకుడు, వైఎస్సార్ జీవనసాఫల్య పురస్కార గ్రహీత శాంతి నారాయణ మాట్లాడుతూ.. 'జలస్వప్నం' పేరుతో మల్లెల నరసింహమూర్తి నీటిపై రాసిన కవిత్వంతోనే ఎంతో మందిని ఆలోచింపజేశారన్నారు. అదే ఒరవడితో చాలా కాలం తర్వాత ఏకంగా రెండు పుస్తకాలను తేవడం ఈ తరానికి స్ఫూర్తినందిస్తున్నారు. తరాలుగా రాయలసీమ నీళ్లు, నిధుల లేమితో కన్నీటి జీవనం సాగిస్తోందని, గోదావరి కావేరీ నదుల అనుసంధానంతోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. గోదావరిలోకి 11 టీఎంసీల నీరు వృథాగా పోతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ తరాల స్వప్నమైన నీటి సమస్యల పరిష్కారమవుందని అభిప్రాయపడ్డారు. అంతకు ముందు ముఖ్య అతిథులుగా రాగయుక్తంగా పాడిన జాషువా పద్యాలు, సీమ ఉద్యమకారులు అమ్మణ్ణమ్మ, జేవీవీ లక్ష్మీనారాయణ ఆలపించిన ఉద్దీపనా గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న రాచపాలెం తదితరులు

గాండ్ల కుల వైభవాన్ని చాటి చెబుదాం

అనంతపురం ఎడ్యుకేషన్: శతాబ్దాల చరిత్ర కలిగి గానుగల ద్వారా నూనె తయారు చేసి పౌర సమాజానికి వెలుగులు పంచిన గాండ్ల తెలికుల గత వైభవాన్ని సమాజానికి చాటి చెబుదామని అఖిల గాండ్ల, తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం-ఆంధ్రప్రదేశ్ (ఏజీటీయూపీఎస్-ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పేస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏజీటీయూపీఎస్ అనంతపురం జిల్లా సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గాండ్ల కుల నాయకులు గిరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖకు అనుబంధంగా ఏజీటీయూపీఎస్ అనంతపురం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర మీడియా సెక్రెటరీగా సీనియర్ జర్నలిస్టు కేపీ కుమార్, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కే.విజయలక్ష్మిని ప్రకటించారు. అనంతరం నూతన జిల్లా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ కండెక్టర్ కేఎల్ఎన్ ప్రసాద్ , టీచర్ కే. రత్నమ్మ, బీసీ నాగలింగం, గాండ్ల హరినాథ్, పార్నపల్లి వేణుగోపాల్, ఏపీఐఐసీ రిటైర్డ్ అసిస్టెంట్ జోనల్ మేనేజర్ జి.చలపతి, పెరవలి రమేష్, హిమగిరి ప్రసాద్, మద్దిలేటి (ఐకెపి), కే రాజేంద్ర, రణ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతో పేదరికాన్ని జయించొచ్చు

అనంతపురం ఎడ్యుకేషన్: 'తాతల కాలం నుంచి ఈత, తాటిచెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవనం సాగించిన ఈడిగ (గౌడ) కుటుంబాలల్లో ఇప్పుడిప్పుడే మార్పులు వస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం పిల్లలను చదివించడమే. చదువుతోనే పేదరికాన్ని జయించొచ్చని పలువురు వక్తలు అన్నారు. నగర శివారులోని రేణుకా యల్లమ్మ ఆలయ ఆవరణలో ఈడిగ (గౌడ) ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈడిగ (గౌడ) విద్యార్థులకు ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.నాగభూషణం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూరగాని రవిశంకర్‌గౌడ్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు మార్గాని శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాయలసీమ ఇన్‌చార్జ్ బీసీ రమేష్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈడిగ (గౌడ) కులస్తులు పిల్లలను బాగా చదివించాలని కోరారు. కులస్తులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా అందరూ కలిసికట్టుగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం బ్రాందీషాపుల్లో 25 శాతం ఈడిగ కులస్తులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం 42 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు ఆదినారాయణ గౌడ్, రాజుగౌడ్, శివానందగౌడ్, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, ఉద్యోగ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, విశ్వనాథ్‌గౌడ్, రాఘవేంద్ర గౌడ్, మనోహర్ గౌడ్, నారాయణ స్వామి గౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న ఈడిగ (గౌడ) సంఘం నాయకులు

సంతల ఆదాయం రూ.2.73 లక్షలు


అనంతపురం సెంట్రల్: స్థానిక మార్కెట్ యార్డులో ప్రతి శని,ఆదివారంలో జరిగే గొర్రెలు, పశువుల సంత ద్వారా ఈ వారం రూ.2.73 లక్షలు ఆదాయం వచ్చినట్లు యార్డు అధికారులు తెలిపారు. గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,53,600, పశువుల సంత ద్వారా రూ.1,20,260 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

పాలన చేతగాక పత్రాలు విడుదల చేస్తారా?

అనంతపురం ఎడ్యుకేషన్: అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేయలేక పత్రాలు విడుదల చేస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు ఖజానాలో రూ.100 కోట్లు ఉన్నప్పుడు వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. ప్రజలకు 'ఇచ్చిన మాట తప్పాల్సి వస్తే పదవి వదలి వెళ్లిపోతాను' అని వైఎస్ జగన్ చెప్పినట్లు గుర్తు చేశారు. ఈ రోజు ఖజానాలో నిధులు ఉన్నా ఎందుకు పాలన చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం అప్పులు చేసి శ్రీలంక అయిపోయిందని చెప్పిన మీరే కదా ప్రజలకు హామీ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చంద్రబాబు, లోకేష్ కొన్ని పథకాలను వాయిదా వేయడం అన్ని పథకాలను కుదించడం చూస్తే అభివృద్ధిని వాయిదా వేయడమే అన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా పెట్టలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో పథకాల క్యాలెండర్‌కు అలవాటు పడిన ప్రజలు జగన్‌ను గుర్తుకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. రెండు నెలల కాలంలో పింఛన్లు మినహాయిస్తే ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి జరగలేదన్నారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు అరికట్టాలి

అనంతపురం అర్బన్: ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ నాయకుల వేధింపులు అధికమయ్యాయని మంత్రి సత్యకుమార్‌కు ఏఐటీయూసీ నాయకులు విన్నవించారు. వేధింపులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం అనంతపురం పర్యటనకు విచ్చేసిన మంత్రిని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఇతర నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్కీమ్ వర్కర్లుగా పని చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను తొలగించి అధికార పార్టీ వారిని చేర్చుకుంటునారన్నారు. దీంతో ఏళ్లగా పని చేస్తున్న వారు వీధిపడే పరిస్థితి తీసుకొచ్చారన్నారు. ఇలాంటివి జరగకుండా చూడాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు కాంట్రాక్టర్లు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని చెప్పారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయడం లేదన్నారు. ఆశా వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అదే విధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకూ కనీస వేతనం అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అసంఘటిత రంగ ఆటో, హమాలీ కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్య నిర్వాహక అధ్యక్షుడు కృష్ణుడు, ఉపాధ్యక్షురాలు నాగమణి, శ్రీనివాసులు, కార్యదర్శులు చిరంజీవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సత్యకుమార్‌కు సమస్యను వివరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మంత్రిని కలిసిన 'అపుస్మా' నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్‌ను అనంతపూరం జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (అపుస్మా) నాయకులు కలిశారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్ర, గౌరవ అధ్యక్షుడు నాయుడు, ట్రెజరర్ ఇక్బాల్, నగర కార్యదర్శి రవిశంకర్ ప్రసాద్, రామచంద్రారెడ్డి, జలీల్, నారాయణ రెడ్డి, అన్వర్ తదితరులు ఉన్నారు.